# కదిలింది జాతర బస్సు!

-మొదటిపేజీ తరువాయి

భావిస్తున్నారు. గత జాతరకు ఆర్టీసీ బస్సుల ద్వారా 18లక్షల మంది భక్తులు హాజరవ్వగా ఈసారి 25 లక్షల మంది తరలివస్తారని ఆర్టీసీ అంచనా వేస్తోంది. మేడారంలో 50 ఎకరాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ప్రారంభిస్తారు. భక్తుల కోసం బస్టాండ్‌లో ప్రత్యేక క్యూలైన్లు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, బస్సుల సమాచారం తెలిపే ఎల్‌ఈడీ స్క్రీను వంటి వసతులు ఏర్పాటు చేశారు.

**10కి.మీ మేర పారిశుధ్యం**

ఈనెల 28 నుంచి 31వ తేదీ దాకా మేడారం జాతరలో భక్తులు ఇబ్బంది పడకుండా 'స్వచ్ఛ మేడారం' కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మహా జాతర సాగినన్నాళ్లూ 6వేల మంది పారిశుధ్య కార్మికులు విధుల్లో ఉంటారు. వీరిలో మరుగుదొడ్ల శుభ్రత కోసమే 2వేల మందిని నియమించారు. 100 చెత్త తరలింపు వాహనాలు, 40 స్వచ్ఛ ఆటోలు, 1120 తోపుడుబండ్లు, 18 ఎక్స్‌కవేటర్లు, 5 స్వీపింగ్ యంత్రాలు పెట్టారు. పారిశుధ్య సిబ్బంది మూడు షిఫ్టుల్లో పనిచేస్తారు. పారిశుధ్య కార్మికుల కోసం మేడారం జాతరను 10 జోన్లుగా విభజించారు. జోన్‌కు 400 మంది కార్మికుల చొప్పున చుట్టూ 10 కి.మీ మేర విధుల్లో ఉంటారు. అయితే జాతర ముగిశాక 6వేలమందిని ఇళ్లకు పంపించి.. మరో 3వేల మందితో రోడ్ల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫినాయిల్ స్ప్రే చేయడం వంటి పనులతో మేడారం పరిసరాలను శుభ్రం చేయిస్తామని ఈ పనులను పర్యవేక్షిస్తున్న ములుగు డీఆర్‌వో వెంకటయ్య చెప్పారు. కాగా మహా జాతరకు ముందే మేడారం జనసంద్రమైంది. శుక్రవారం దాదాపు 3లక్షల మంది భక్తులు గద్దెలను దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. జంపన్నవాగు స్నాన



ఘట్టాలు, కల్యాణకట్టలు, గద్దెల పరిసరాలు కిటకిటలాడాయి.

**ఎల్‌ఈడీ నేమ్ స్టాండ్ కూలి..**

మేడారం పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఓ ఎల్‌ఈడీ నేమ్ స్టాండ్ కూలి మీదపడడంతో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఎడ్ల నర్సయ్య అనే భక్తుడికి గాయాలయ్యాయి. గద్దెలపైకి భక్తులు విసిరిన ఓ కొబ్బరికాయ తగిలి ఏసీపీ నర్సయ్య గన్‌మెన్ వీరబ్రహ్మేంద్రచారి తలకు గాయమైంది. జంపన్నవాగులో పుణ్యస్నానం చేసేందుకు నీళ్లలో దిగిన ముగ్గురు భక్తులు నీట మునగగా.. ప్రత్యేక సిబ్బంది వారిని రక్షించారు. హైదరాబాద్‌కు చెందిన ఏంఆర్ వినోద్ (58) అనే భక్తుడు మేడారంలో గుండెపోటుతో మృతిచెందాడు.

**ఛత్తీసగఢ్ సీఎంకు ఆహ్వానం**

మేడారం జాతరకు రావాలని సమ్మక్క పూజారి సిద్దబోయిన సురేందర్ శుక్రవారం ఛత్తీసగఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని ఆహ్వానించారు. రాయపూర్‌లోని సీఎం నివాసంలో విష్ణుదేవ్‌ను పూజారి సురేందర్ కలిశారు. సమ్మక్క, సారలమ్మ జాతర ఈ నెల 28 నుంచి 31 వరకు జరుగుతుందని, తప్పకుండా రావాలని ఆహ్వానించారు.

# కాలుష్యమే పెద్ద సవాల్!

హైదరాబాద్

ప్రస్తుతం జాతీయ స్థాయిలో, రాష్ట్రాల్లోనూ కాలుష్యమే అతిపెద్ద సవాల్‌గా పరిణమించింది. తాజాగా దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) వేదికగానూ భారత్‌లో కాలుష్య వ్యాప్తి తీవ్ర చర్చనీయాంశమైంది. ఇండియాలో పీల్చే గాలి కాలుష్యభరితంగా మారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితులు ఏర్పడడంపై ఆందోళన సైతం వ్యక్తమైంది. ఇదిలా ఉంటే...ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆర్థికవేత్త వెలిబుచ్చిన అభిప్రాయాలను సీరియస్‌గా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగిన కార్యాచరణను చేపట్టాల్సిన అవసరముందని పర్యావరణ వేత్తలు, నిపుణులు చెబుతున్నారు. ఇండియాలో గాలి, నీరు, ఇతర రూపాల్లో వ్యాపిస్తున్న కాలుష్యాలను పకడ్బందీ నియంత్రణతోనే దేశంలోని నగరాలు, పట్టణాలు సుస్థిరమైనవిగా మారతాయని సూచిస్తున్నారు. భారత్‌లోని ఉత్తరాది రాష్ట్రాలు మరీ ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్రంగా క్షీణిస్తున్నందున... దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ అదే దుస్థితి తలెత్తకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా జాగ్రత్త పడాలని చెబుతున్నారు. నగరాలు, పట్టణాలను అన్ని విధాలుగా సుస్థిరమైనవిగా మార్చే దిశలో ప్రణాళికలు రూపొందించాలని అంటున్నారు. ప్రస్తుతం ప్రాధాన్యత సంతరించుకున్న అంశాలపై ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు.

**కాలుష్యంతోనే భారత్‌కు ఆర్థిక భారం**

అమెరికా లేదా ఐరోపా దేశాలు పెద్ద మొత్తంలో విధించబోయే వాణిజ్య పరమైన సుంకాల కంటే కూడా కాలుష్యంతోనే భారత్‌కు అధిక ఆర్థిక భారంతో పాటు పెనుసవాళ్లను ఎదుర్కోబోతోంది. భారత్‌లో ఏడాదికి 17 లక్షల మంది కాలుష్యం కారణంగా చనిపోతున్నారు.విషపూరితమైన లేదా కాలుష్యభరితమైన వాయువుల ఉత్పాదకత, పెట్టుబడులపై శాశ్వత పన్నులుగా పనిచేస్తాయన్నారు. అందువల్ల భారత్ సురక్షితమైన, స్వచ్ఛమైన గాలిని 'టాప్ నేషన్ మిషన్'చేయాలి. గీతా గోపీనాథ్, ప్రముఖ ఆర్థికవేత్త.

**ఈపీఎ తీసుకురాకపోవడం బాధాకరం**

భారత్‌లోని వివిధ రాష్ట్రాల్లోని నగరాలతో సహా, తెలంగాణలో హైదరాబాద్, ఇతర నగరాలు,



పట్టణాలకు ఢిల్లీ వంటి విపత్కర పరిస్థితి రాకుండా ఉండేలా వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం ఢిల్లీ నుంచి పాట్నా వరకు తలెత్తిన కాలుష్య పరిస్థితులు, దక్షిణాదికి మరీ ముఖ్యంగా తెలంగాణకు హైదరాబాద్‌కు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఇటీవల హైదరాబాద్‌లోనూ గాలి నాణ్యతాస్థాయులు ప్రమాదకరంగా మారాయంటే పరిస్థితి తీవ్రత అర్థమౌతోంది. స్థానిక ప్రభుత్వాలకు (మున్సిపాలిటీలు, స్థానికసంస్థలు) రవాణా, వ్యర్థాల నిర్వహణ, కాలుష్యాలపై చర్య తీసుకునే అధికారం కూడా లేదు.

ఇన్ని ప్రభుత్వాలు మారినా ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ యాక్ట్ (ఈపీఏ)వంటివి ఇప్పటికీ తీసుకురాకపోవడం బాధాకరం. గాలి, నీరు వంటి ప్రకృతి జీవన వనరులు కాలుష్యం బారిన పడడాన్ని పౌరులు ఎక్కడికక్కడ గట్టిగా నిలదీయాల్సి ఉంది. ప్రస్తుతం అభివృద్ధి జరుగుతున్న తీరు వల్ల పర్యావరణ వ్యవస్థలపై పడుతున్న దుష్ప్రభావాలపై ప్రజలు గొంతు ఎత్తాల్సిన అవసరముంది. సుస్థిర అభివృద్ధి (సస్టెయినబుల్ డెవలప్‌మెంట్)సాధన దిశలో అనేక అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయాలి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు వంటి నగరపాలక సంస్థలు సొంతంగా పనిచేసేలా అన్ని అధికారాలు కల్పించాలి.

**మోడలింగ్ స్టడీస్ చేయాలి**

నగరాలు, పట్టణాలను సమతుల్యమైన, సుస్థిరమైన అభివృద్ధి పథంలో నడిపించడం సవాళ్లతో కూడుకున్నదిగా మారింది. రాబోయే రోజుల్లో నగరాల్లో భూ వినియోగం విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరముంది. ప్రస్తుతం దేశంలోని ప్రతీ నగరం వాయు కాలుష్య ప్రమాద తీవ్రతను ఎదుర్కొంటోంది. విపరీతమైన నగరీకరణతో వేడిగాలులు కూడా పైకి వెళ్లే పరిస్థితులు లేకుండా పోయాయి. వాయు కాలుష్యం, నీరు తదితరాలపై పూర్తి స్థాయి మోడలింగ్ స్టడీస్ చేయాల్సిన అవసరం ఉంది.

## కరుణతోనే సామాజిక మార్పు

హైదరాబాద్

'మీరు చదువుకోవడానికే పుట్టారు, మేము పని చేయడానికే పుట్టాం'అని సాటి బాలుడు నా బాల్యంలోనే అన్న మాటలు నాకింకా గుర్తు. అప్పటి నుంచి లక్ష మందికిపైగా బాల కార్మికులకు విముక్తి కలిగించిన ప్రస్తుత ప్రయాణం వరకు చూసిన ఎన్నో అనుభవాలు నేను పొందిన నోబెల్ బహుమతి కన్నా ప్రభావవంతమైనవని' సమాజ సేవకుడు, 50 ఏళ్ల నుంచి బాల కార్మిక నిర్మూలన కోసం విశేష కృషి చేస్తూ నోబెల్ శాంతి బహుమతి పొందిన కైలాష్ సత్యార్థి తెలిపారు. ఆయన అనుభవాలతో పాటు సామాజికంగా 'కరుణ'ప్రాధాన్యం నేపథ్యంగా తాను రాసిన 'కరుణ: ది పవర్ ఆఫ్ కంపాషన్' పుస్తకాన్ని శనివారం నగరంలో ప్రారంభం కానున్న హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా కైలాస్ సత్యార్థి ప్రత్యేకంగా 'సాక్షి'తో మాట్లాడారు. ఆయన పంచుకున్న అనుభవాలు, ఆలోచనలు ఆయన మాటల్లోనే.. ప్రపంచం ఎప్పుడూ లేనంత సంపన్నంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందింది. కానీ ఇదే సమయంలో ప్రపంచం ఇంతగా విభజించబడిన దశ మరొకటి లేదనే చెప్పాలి. దీని ప్రభావం మానవాళితో పాటు ప్రపంచ పర్యావరణంపైన కూడా పడుతోంది. దీనంతటికీ ప్రధాన కారణం కరుణ లేకపోవడం. లక్ష మందికి పైగా బాల కార్మికులు, పిల్లల అక్రమ రవాణా నుంచి విముక్తి కలిగించడంలో నన్ను నడిపింది కరుణ మాత్రమే. నేటి ప్రపంచం సమస్యల సంద్రంలో కొట్టుమిట్టాడుతున్న వారికి పరిష్కారం అందించలేని 'నైతిక లోటు'ప్రధాన సమస్య. ఈ లోటు వల్లే యుద్ధాలు, హింస, ద్వేషం, వివక్షలు పెరిగిపోతున్నాయి. దీనికి తోడు రాజకీయాలు, వ్యాపారం..అన్నింటిలోనూ దూకుడు పెరిగిపోయింది. నిజమైన కరుణ ఒక సామాజిక శక్తి. లింగ వివక్ష, జాతి వివక్ష, యుద్ధాలు వంటి లోతైన సామాజిక సమస్యలను కేవలం దయతో పరిష్కరించలేం. దీని కోసమే నా పుస్తకంలో తొలిసారిగా 'కంప్యాషన్ కోషెంట్'(సీక్యూ) అనే భావనను పరిచయం చేశా. ఇది ఒక వ్యక్తి సమస్యలను తనవిగా భావించి పరిష్కరించే సామర్థ్యం. భవిష్యత్తులో ఉద్యోగాలు, వివాహాలు కూడా సీక్యూ ఆధారంగా నిర్ణయించబడే రోజులు వస్తాయి. కరుణను పెంచేందుకు టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగిస్తారు. దీనిని కొలిచే యాప్‌లు, డిజిటల్ టూల్స్ అభివృద్ధి చేయబడతాయి. ఇందులో న్యాయం, సమానత్వం, శాంతి, స్థిరత్వం ముఖ్యమైనవి. బాల కార్మికత్వం నా చిన్నప్పటి నుంచి చూస్తున్నాను. మా నాన్న చనిపోయి ఎన్నో కష్టాలు ఉన్న ఆ సమయంలో మా అమ్మ చాలా భయపడింది.

## 25 కాదు.. 10 శాతమే

-మొదటిపేజీ తరువాయి

దృష్టికి కమిషనర్ తీసుకెళ్లి చర్చించారు.

**ముందుకు వస్తున్న మిల్లర్లు..**

దాదాపు 18 లక్షల టన్నుల మిగులు ధాన్యాన్ని నిల్వచేయడానికి స్టోరేజీ సమస్యలు ఉండటం, మిల్లింగ్ చేశాక ఏ బియ్యాన్ని ఏం చేయాలన్న సవాళ్ల నేపథ్యంలో నూకశాతాన్ని తగ్గించి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత చూపిస్తోంది. కేంద్రం కొత్త ప్రతిపాదన మేరకు 10 శాతం నూకలతో బియ్యం ఇస్తామని చెప్పేందుకు మంత్రి ఉత్తమ్ కమిషనర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నూకలు 25 శాతం కాకుండా 10 శాతంతోనే ఇచ్చేందుకు కొందరు మిల్లర్లు ముందుకు వచ్చినట్లు సమాచారం. మిగతావారితోనూ మాట్లాడి ఒప్పించేందుకు పౌరసరఫరాలశాఖ ప్రయత్నించనున్నట్లు సమాచారం. అయితే తక్కువ నూకల శాతంతో బియ్యం ఇవ్వాలంటే ఆర్థికనష్టం ఉంటుందని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చేయాలని కొందరు మిల్లర్లు కోరుతున్నట్లు తెలుస్తోంది.

## అవినీతి ఊబిలో కాంగ్రెస్ సర్కారు

-మొదటిపేజీ తరువాయి

చదువుతూ.. ఈయన తెలుసా? ఆయన తెలుసా? అంటూ టైంపాస్ చేశారు. 'ఫోన్ ట్యాపింగ్ విచారణను రెండేళ్లుగా కొనసాగిస్తున్నారు. అవాస్తవ లీకులిస్తూ మా నాయకుల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. హీరోయిన్ల ఫోన్లు ట్యాపింగ్ జరిగినట్లు ఏమైనా ఆధారాలున్నాయా? ఉంటే బయటపెట్టండి. ఈ అవాస్తవ లీకులకు బాధ్యులెవరూ? వాటిని మీరు నిరోధించలేరా?' అని అధికారులను ప్రశ్నించా. వాస్తవమైతే మా ముందు పెట్టండనీ అడిగా. 'మాకు సంబంధం లేదు.. మాకేమీ తెలియదంటూ' అధికారులు నీళ్లు నమిలారు. విచారణ సమయంలో తారక రామారావు తప్ప... మరో రావు ఎవరూ లేరు. మీరు ఎన్ని కేసులైనా పెట్టండి. ఎన్ని సిట్‌లన్నా వేయండి. ఎన్నిసార్లు పిలిచినా వస్తామని అధికారులకు చెప్పా.

**ముందు హామీల అమలుపై దృష్టిపెట్టండి**

ఈరోజు రాష్ట్రంలో వ్యవసాయం మొదలు అన్ని రంగాల్లో వ్యవస్థలు కుప్పకూలాయి. మేం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతల కుటుంబాలను ఏనాడూ రాజకీయాల్లోకి లాగలేదు. అక్రమ కేసులు పెట్టి వేధించలేదు. కానీ, గత ఐదారేళ్లుగా నాపై కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన దుష్ప్రచారం చేసింది. డ్రగ్స్ కేసులో హీరోయిన్లతో సంబంధాలంటూ నన్ను అనేక అంశాల్లో ఇరికించాలని చూసింది. నా కుటుంబాన్ని, పిల్లలనూ మానసిక క్షోభకు గురిచేశారు. అయినా నేను ఎవరికీ భయపడలేదు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ అంశంలోనూ ఎవరి కుట్రలకు భయపడేదే లేదు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని కచ్చితంగా ఎత్తిచూపుతాం. ఇవాళ సింగరేణి టెండర్లలో కుంభకోణం బయటపడింది. సీఎం, మంత్రుల మధ్య వాటాల పంచాయతీలో ఇది బహిర్గతమైంది. రూ.300 కోట్ల కోసం ఒక పారిశ్రామికవేత్త తలకు తుపాకీ పెట్టారని చెప్పి కేసు నమోదైతే.. దానిపై సిట్ ఎందుకు వేయలేదు? స్వయంగా ఒక మంత్రి కుమారుడు భూకబ్జాలు చేస్తూ గూండాలను తీసుకొని స్వైరవిహారం చేస్తుంటే... దానిపై సిట్ లేదు? హిల్ట్ పాలసీ పేరిట రూ.5 లక్షల కోట్ల ప్రజల ఆస్తిని కొల్లగొట్టడంపై ఎందుకు దర్యాప్తు చేయరు? ముఖ్యమంత్రి బావమరిదికి అర్హత లేకపోయినా... కేంద్ర ప్రభుత్వ పథకంలో టెండర్లు కట్టబెడుతున్నారని ఆధారాలతో సహా కేంద్రానికి ఇస్తే.. దానిపై ఎందుకు విచారణ జరిపించరు? న్యాయం, ధర్మం, ఖాకీ బుక్కు అందరికీ ఒకటే తీరు ఉండాలి కదా? ప్రభుత్వం ఈ కక్షసాధింపు వైఖరిని వీడి.. ముందుగా ఆరు గ్యారంటీల అమలుపై, పరిపాలనలోని వైఫల్యాలపై దృష్టి పెట్టాలి" అని కేటీఆర్ సూచించారు.

## మెడికల్ బిల్లులకు మోక్షమెప్పుడు?



హైదరాబాద్

కార్మిక రాజ్యబీమా పరిధిలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు భారీగా పేరుకుపోతున్నాయి. చికిత్స పొందిన కార్మికులు...వెనువెంటనే బిల్లులు సమర్పిస్తున్నప్పటికీ వాటిని ఆమోదించడం, నిధులు విడుదల చేయడంలో మెడికల్ ఇన్సూరెన్స్ సర్వీసెస్ సంచాలక కార్యాలయం(డీఐఎంఎస్) తీవ్ర జాప్యం చేస్తోంది. దాదాపు మూడేళ్లకు పైబడి మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. దాదాపు 11 వేల బిల్లులకు సంబంధించి రూ.55 కోట్లమేర బకాయిలు ఉన్నట్లు తెలిసింది. సాధారణంగా మెడికల్ బిల్లు సమర్పించిన నాటి నుంచి మూడు నెలల్లోపు పూర్తిగా చెల్లింపులు చేయాల్సి ఉండగా...ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులు డీఐఎంఎస్ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

**అత్యవసర సేవల కోసం...**

రాష్ట్రంలో ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ)పరిధిలో 18.75లక్షల మంది కార్మికులు చందాదారులుగా కొనసాగుతున్నారు. వేతనం నుంచి నెలవారీ చందా ఈఎస్ఐసీకి చెల్లిస్తుండడంతో వారికి వైద్య సేవలు ఉచితంగా అందించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఈఎస్ఐ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కొనసాగుతుండగా...రాష్ట్ర కార్మిక శాఖ పరిధిలో ఉన్న మెడికల్ ఇన్సూరెన్స్ సర్వీసెస్ డైరెక్టరేట్ పరిధిలో 10 ఆస్పత్రులు, 70 డిస్పెన్సరీల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. సమీపంలో ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడం, లేదా అక్కడ వైద్య సేవలకు మౌలిక వసతులు లేకపోవడం, అత్యవసర కేటగిరీలో శస్త్ర చికిత్సల కోసం ఈఎస్ఐసీ గుర్తింపు పొందిన ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐపీ సేవలు పొందే వెసులుబాటు కల్పించింది. ఈ కేటగిరీలో వైద్య సేవలు పొందేందుకు ముందుగా కార్మికుడు వ్యక్తిగతంగా ఖర్చులు భరించి...ఆ తర్వాత బిల్లులు సమర్పించి నిధులు పొందవచ్చు. కార్పొరేషన్ పరిధిలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి మినహాయిస్తే... నాచారం, జీడిమెట్ల, రామచంద్రాపురం, వరంగల్ ఆస్పత్రుల్లో అత్యాధునిక వసతులు లేకపోవడంతో వైద్య సేవల కోసం ప్రైవేటు ఆస్పత్రుల బాట పడుతున్నారు. గత మూడేళ్లుగా ఈ కేటగిరీలో దాదాపు 15వేల మంది కార్మికులు ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలు పొందారు. ఇందులో దాదాపు 11వేల బిల్లులకు సంబంధించి నిధులు విడుదల కాకుండా పెండింగ్‌లో ఉన్నాయి.

**కార్పొరేషన్ నిధులిచ్చినా...**

కార్మికుల వైద్య సేవల కోసం ఈఎస్ఐసీ పరిధిలోని ఆస్పత్రుల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఖర్చు చేయడంతోపాటు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తుంది. ప్రతి మూడు నెలలకోసారి ఈ నిధులను విడుదల చేస్తుంది. అయితే ఈ నిధులు నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాకు విడుదల చేస్తాయి. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ ఇన్సూరెన్స్ సర్వీసెస్ డైరెక్టరేట్‌కు విడుదల చేయాలి. కానీ రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులు విడుదలలో జాప్యం చేస్తోంది. దీంతో మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు నిలిచిపోవడంతో బిల్లుల క్లియరెన్స్ కోసం కార్యాలయానికి వచ్చే కార్మికులకు బడ్జెట్ రాలేదంటూ చేతులు దులిపేసుకుంటున్నారు.

